పదిలో మెరుపులు

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ
- ఉత్తమ ఫలితాల సాధన


ప్రతిభ చూపిన విద్యార్థులతో కేడీపీఎం పాఠశాల అధ్యాపకులు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదల చేసింది. ఈ ఫలితాలలో నియోజకవర్గంలో తోటగరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదవాల్తేరులో కేడీపీఎం ఉన్నత పాఠశాల, ఆంధ్రా యూనివర్సిటీ ఉన్నత పాఠశాలతో పాటు శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు.

తోటగరువు హైస్కూల్‌లో 45 శాతం ఉత్తీర్ణత

ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 45 శాం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలలో ఈ ఏడాది 357 మంది విద్యార్థులు పతో తరగతి పరీక్షలు రాయగా వారిలో 162 మంది ఉత్తీర్ణులయ్యారు.ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విదార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీకృష్ణాపురం గురుకులంలో 72 శాతం ఉత్తీర్ణత..

శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఈ ఏడాది 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ 76 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసారు. వారిలో 55 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

వందరోజుల ప్రణాళికతో సత్ఫలితాలు

ఏయూక్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం అవలంభించిన వందరోజుల ప్రణాళిక మంచి ఫలితాలను ఇచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి దోహదపడింది. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించడం, విద్యార్థులను అధ్యాపకులు దత్తత తీసుకుని వారికి మార్గనిర్దేశం చేయడం వంటి కార్యక్రమాలు ఉత్తీర్ణత పెంపునకు దోహదపడ్డాయి.

కేడీపీఎంలో పెరిగిన ఉత్తీర్ణత

స్థానిక 20 వార్డు కేడీపీఎం ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాలలో 65 శాతం ఉత్తీర్ణత నమోదయింది. గతేడాది ఉతీతర్ణత 43 శాతం కాగా ఈ ఏడాది 22 శాతం ఉత్తీర్ణత పెరిగి 65 శాతం మంది పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 142 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 92 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 46 మంది ప్రథమ శ్రేణిలో, 30 మంది ద్వితీయ శ్రేణిలో, 16 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. సబ్జెక్టుల వారీగా ఉత్తీర్ణత పరిశీలిస్తే ఇంగ్లీషులో 99.3, గణితంలో 80.2. సోషల్ స్టడీస్‌లో 82, సైన్స్‌లో 77, తెలుగులో 87, హిందీలో 96 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కేవలం ఒకసబ్జెక్టులో ఫెయిలైన వారు 17 మంది, రెండు సబ్జెక్టుల్లో ఫెయిలైన వారు 13 మంది ఉన్నారు. త్వరలో జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో వీరు సైతం ఉత్తీర్ణత సాధిస్తే పాఠశాల ఉత్తీర్ణత మరింత పెరిగే అవకాశం ఉంది.

ఏయూ ఆంగ్ల మాధ్యమంలో 97.5 ఉత్తీర్ణత

ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో 82 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా 80 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఉత్తీర్ణత శాతం 97.5గా నమోదయింది. వీరిలో ప్రథమశ్రేణిలో 74, ద్వితీయ శ్రేణిలో 5, తృతీయ శ్రేణిలో ఒక్కరు ఉత్తీర్ణత సాధించారు.

తెలుగు మాధ్యమంలో 40 శాతం ఉత్తీర్ణత

ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాలలో 56 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 22 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఉత్తీర్ణత 40 శాతం నమోదయింది.


విద్యార్థిని సత్కరిస్తున్న అధ్యాపకులు


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శిల్ప

నారాయణలో ఉత్తమ ఫలితాలు

ఎంవీపీకాలనీ: నారాయణ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల అధినేత ఏజీఎమ్ రాజ్‌కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు మాట్లాడుతూ నారాయణ విద్యార్థులు ఎంవీపీ కాలనీ, వాల్తేర్ బ్రాంచుల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్తేర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ సంగీతా శ్రీధర్, అకడమిక్ కో-ఆర్డినేటర్ శివప్రతాప్, అకడమిక్ డీన్ రామ్ నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాష్యంలో 92 శాతం ఉత్తీర్ణత

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ భాష్యం బ్రాంచ్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. ఈ స్కూల్ నుంచి 148మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 92 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 128 మంది (86.49 శాతం) మంది విద్యార్థులు ప్రథమశ్రేణిలో విజయం సాధించగా 8 మంది విద్యార్థులు ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ కె.శిల్ప శనివారం తెలిపారు.

రోజుకు 15 గంటలకు పైగా చదివా



రోజుకు 15 గంటలకు పైగా చదివాను. ఉపాధ్యాయులు చెప్పిన విధంగా సాధన చేశా. ఏ రోజు చెప్పిన పాఠ్యాంశాలు అదే రోజు పూర్తి చేసేవాడిని. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉంది. ఉన్నత చదువులు చెదివి మంచి ఉద్యోగం చేయాలని ఉంది. నాన్న కార్పెంటర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఆశ నెరవేర్చుతా..

– కాశి శ్రావణ్, తోటగరువు హైస్కూల్

ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తా



పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించినందుకు ఆనందంగా ఉంది. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి ఇంజినీర్ కావాలని ఉంది. పాఠశాలలో ఉపాధ్యాయులు అన్ని సబ్జెక్టులు బాగా బోధించారు. పరీక్షలు సమయం దగ్గరపడుతున్నకొద్దీ మరింత శ్రద్ధతో చదించారు. అందుకే ఉత్తమ ఫలితాలు సాధించా.

– ఏగిరెడ్డి మోనిక ప్రియ, తోటగరువు విద్యార్థి.

ఇంజినీర్ అవుతా



పాలిటెక్నిక్ చదివి ఇంజినీరు కావాలని ఉంది. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందంగా ఉంది. ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు. ఉత్తమ విద్యతో పాటు మా పాఠశాలలో అన్ని సదుపాయాలు బాగున్నాయి. పదో తరగతి ఫలితాల్లో అందరం మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాం.

– రావాడ పురందేశ్వరి, తోటగరువు విద్యార్థిని

క్లుప్తంగా

విశాఖ డెయిరీ డీజీఎంకు ఏయూ డాక్టరేట్


ఉత్తర్వులు స్వీకరిస్తున్న చిట్టోడు

ఏయూక్యాంపస్: విశాఖ డెయిరీ డీజీఎం (ట్రైనింగ్) ఉగ్గిన చిట్టోడుకి ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టరేట్ లభించింది. న్యాయ కళాశాల ఆచార్యులు డి.సూర్య ప్రకాశ రావు పర్యవేక్షణలో 'రైట్ టు వర్క్ అండ్ వర్కర్స్ రైట్స్ విత్ రిఫరెన్స్ టు లేబర్ కోడ్స్ 2020– ఏ సోషియో లీగల్ స్టడీ' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి శుక్రవారం డాక్టరేట్ ఉత్తర్వులను చిట్టోడు స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్.. చిట్టోడుని అభినందించారు. విశాఖ డెయిరీ పూర్వ చైర్మన్ ఆడారి తులసీ రావు స్పూర్తితో తాను పీహెచ్‌డీ చేశానని చిట్టోడు తెలిపారు.

శ్రావ్యంగా గాత్ర కచేరి



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న లక్ష్మీ సూర్యతేజ

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరింలో శనివారం అన్నమయ్య కీర్తనల గాత్ర కచేరి శ్రావ్యంగా సాగింది. నగరానికి చెందిన ప్రముఖ గాత్ర విద్వాంసురాలు ఎ.లక్ష్మీ సూర్య తేజా అన్నమయ్య కీర్తలను ఆలాపించి అలరించారు. కచేరికి ఎస్.పార్థవి వయోలిన్, ఎస్.సుబ్రహ్మణ్యం మృదంగం సహకారం అందించారు. కార్యక్రమాన్ని నేదునూరి శ్రీవల్లీ, ఎం.ఎస్.శ్రీనివాస్, చంద్రశేఖర్ ప్రారంభించారు.

18 రోజుల్లో పది ఫలితాలపై హర్షం

ఎంవీపీకాలనీ: పదో తరగతి ఫలితాలు కేవలం 18 రోజుల్లో విడుదల చేసిన మొట్టమొదటి ప్రభుత్వంగా వైఎస్సార్ సీపీ నిలిచిందని ఏపీ నిరుద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సమయం హేమంత్ వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా వేగవంతంగా ఫలితాలు అందించడంపై హర్షం వ్యక్తం చేశారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి


హాజరు పట్టీ పరిశీలిస్తున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి

డాబాగార్డెన్స్: సచివాలయ కార్యదర్శులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని, ప్రజలకు సేవలందించడంలో ముందుండాలని, అశ్రద్ధ కనపరచిన వారిపై కఠిన చర్యలు తప్పవని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. ఆమె శివాజీపార్క్ సమీపంలో ఆదర్శనగర్ వద్ద 1086101, 103 సచివాలయాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ కార్యదర్శులు యూనిఫాం ధరించి పూర్తి స్థాయిలో విధుల కు హాజరు కావాలన్నారు. అనంతరం హాజరు పట్టీ తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సచివాలయ కార్యదర్శులకు మేయర్ సూచించారు.

ఇంధన పొదుపు పాటించాలి


వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న ఎల్ఎస్ రావు


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

బీచ్‌రోడ్డు: ప్రతి ఒక్కరు ఇంధన వినియోగం తగ్గించుకొని భవిష్యత్తు తరాలకు కొరత లేకుండా చూడాలని గెయిల్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్ఎస్ రావు పిలుపునిచ్చారు. సాక్షమ్ వాకథాన్ పేరుతో ఇంధన పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఆర్కేబీచ్‌లో నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌థాన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్ఎస్‌రావు మాట్లాడుతూ ఇంధన వినియోగం తగ్గించుకునేందుకు నడక, సైక్లింగ్, ప్రజా రవాణా వినియోగించాలన్నారు. భారతదేశం అత్యధికంగా ఇంధనాన్ని దిగుమతి చేసుకోవడం జరుగుతుందన్నారు. కాబట్టి ఇంధన వినియోగం తగ్గించి దేశ ఆర్థిక వ్యవస్థకు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువుర్ని సత్కరించారు. వాక్‌థాన్‌లో పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

చమురు దిగుమతులను తగ్గించాలి

బీచ్‌రోడ్డు: ముడి చమురు దిగుమతులపై మన దేశం ఆధారపడడాన్ని తగ్గించాలంటే ఇంధన పొదుపు చాలా అవసరమని హెచ్‌పీసీఎల్ డీజీఎం (సేల్స్) మురళీకృష్ణ అన్నారు. సాక్షమ్ పేరుతో హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో శనివారం బీచ్‌రోడ్డులో అవగాహన ర్యాలీను నిర్వహించారు. ఈ ర్యాలీను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మన దేశంలోని ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సుందర వదన్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఏయూ వీసీ అభినందన


హర్షితను అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: జాతీయ స్థాయిలో భారత ప్రభుత్వం, లోక్‌సభ సెక్రటేరియట్, విద్య,యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఈ నెల 9వ తేదీన పార్లమెంట్ హాల్‌లో నిర్వహించే గురు రవీంద్రనాథ్ ఠాగూర్ 162వ జయంతి వేడుకల్లో ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థిని హర్షిత దేవగుప్తాపు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా హర్షితను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. దేశ వ్యాప్తంగా 25 ప్రభుత్వ విద్యాలయాల నుంచి 25 మంది విద్యార్థులను ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించడానికి ఎంపిక చేశారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని రవీంద్రనాథ్ ఠాగూర్‌పై హర్షిత ప్రసంగిస్తారు. ఇటువంటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఏయూ విద్యార్థిని భాగం కావడంపై వీసీ ప్రసాద రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఎస్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమావేశం


పూర్వవిద్యార్థిని సత్కరిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ ఐఐఎంలో శనివారం జేఎన్‌టీయూ కాకినాడ వైజాగ్ చాప్టర్ పూర్వవిద్యార్థుల సమావేశం జరిగింది. శనివారం సమావేశమైన విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహనరావు మాట్లాడుతూ జేఎన్‌టీయూ కాకినాడలో చదవడం ద్వారా తమ బ్యాచ్ విద్యార్థులంతా పూర్తిస్థాయిలో ఉన్నత ఉద్యోగాలు సాధించారన్నారు. తమ బ్యాచ్‌తో పాటు ఇతర బ్యాచ్‌లలో జేఎన్‌టీయూ కాకినాడలో చదివిన విద్యార్థులలో విశాఖలో ఉన్నవారితో ఏటా సమావేశమై తమ భావాలను పంచుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా శనివారం సమావేశమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉన్నత స్థాయిలో ఉన్న పలువురిని సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీప్రసాద్, వెంకటరమణ, ఏపీఎస్ఆర్‌టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాద మృతులకు నివాళి


నివాళులర్పిస్తున్న సీఐటీయూ నేతలు

మద్దిలపాలెం : మూడేళ్ల క్రితం ఎల్‌జీ పాలిమర్స్ దుర్ఘటనలో మృతులకు సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నివాళులు అర్పించింది. ప్రమాద స్థూపం నమోనాను ఏర్పాటు చేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళ్లలర్పించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వీ కుమార్ మాట్లాడుతూ ఈ దుర్ఘటన ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు తక్షణం నష్టపరిహారం అందజేయడం శుభపరిణామన్నారు. అయితే గాయపడిన కొందరికి నష్ట పరిహారం అందలేదన్నారు. తక్షణమే బాధిత కుంటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఆఫీసు బేరర్ ఎస్.జ్యోతేశ్వరరావు, పి.మణి, కె.ఎం.కుమారమంగళం, జిల్లా కమిటీ సభ్యులు అప్పలరాజు, నూకరాజు, వెంకటరావు, కుమారి పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో వ్యక్తి మృతి

అల్లిపురం: బీచ్‌రోడ్డులో వాకింగ్ చేయడానికి వచ్చిన వ్యక్తి ఫోన్ మాట్లాడుతూ హార్ట్ ఎటాక్ రావడంతో మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి తన బంధువుల ఇంటికి నెల రోజుల క్రితం వచ్చారు. శనివాయం సాయంత్రం బీచ్‌రోడ్డులో వాకింగ్ చేయడానికి వెళ్లిన ఆయన నోవాటెల్ హోటల్ ఎదురుగా గట్టుపై కూర్చుని ఫోన్ మాట్లాడుతుండగా హార్ట్ ఎటాక్ రావడంతో వెనక్కి పడిపోయి అక్కడికక్కడే మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుని బంధువులకు సమాచారం అందజేయడంతో వారొచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు.

బీజేపీ పాలనలో కార్మిక చట్టాలు నిర్వీర్యం

- అఖిల భారత సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్
- ఉక్కు రిలే దీక్షకు సంఘీభావం

కూర్మన్నపాలెం: శ్రామికుల కష్టనష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ము కాస్తూ, బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని అఖిల భారత సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 814వ రోజు శనివారం కోక్‌ఓవెన్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపన్‌సేన్ మాట్లాడుతూ విభన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాల నష్టాల్లోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. ప్రైవేట్ కంపెనీలు అప్పులు చేసి తిరిగి కట్టకుండా ఎగ్గొడితే వాటిని రుణ మాఫీ పేరుతో మాఫీ చేస్తున్నారని విమర్శించారు. ప్రాణత్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నవ్వేల్.. పువ్వేల్

- నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం


ఒక నవ్వు.. మనిషి అంతరంగాన్ని
ఆవిష్కరిస్తుంది
ఒక నవ్వు.. వ్యక్తి ఆరోగ్యాన్ని సూచిస్తుంది
ఒక నవ్వు.. ఒత్తిడిని జయిస్తుంది
ఒక నవ్వు.. ఆహ్లాదాన్ని పంచుతుంది
ఒక నవ్వు.. శరీరానికి కావాల్సిన
శక్తినందిస్తుంది
ఇంతటి మహత్తర శక్తి
ఒక్క చిరునవ్వుకే సాధ్యం
సంగీతానికి రాళ్లు కరుగుతాయో లేదో
తెలియదు కానీ..
నవ్వుతో మాత్రం వ్యాధులు
నయమవుతాయన్నది
శాస్త్రీయంగా నిరూపితమైంది.


తెన్నేటి పార్కులో లాఫ్టర్ యోగా కార్యక్రమంలో గుంపులుగా చేరి నవ్వుకుంటున్న సభ్యులు

అల్లిపురం : నవ్వు నాలుగు విధాల చేటు పాత నానుడి..నవ్వు నలభై విధాల లాభం అనేది నేటి నానుడి. నవ్వు వలన వచ్చే ప్రయోజనాలు తెలుసుకున్న కొంత మంది ప్రతి రోజు గుంపులుగా చేరి నవ్వుకుంటూ ఇతరులను నవ్విస్తూ నగరంలో చాలా చోట్ల కనిపిస్తున్నారు. తెన్నేటి లాఫ్టర్ క్లబ్ పేరిట 20 ఏళ్లుగా తెన్నేటి పార్కులో నవ్వులు కురిపిస్తున్నారు. వీరంతా ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు గుంపులుగా చేరి నవ్వుకుంటూ, వివిధ ఎక్సర్ సైజ్‌లు చేస్తూ పార్కుకు వచ్చేవారిని ఆకర్షిస్తున్నారు. ఈ క్లబ్‌లో రిటైర్డ్ ఉద్యోగులు, ప్రొఫెసర్లు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు, బిజినెస్‌మెన్‌లు, సాధారణ వ్యక్తులూ ఉన్నారు.

నవ్వు వలన ఆరోగ్యం.. : వ్యాపారాలు, కార్యాలయం పనులు బిజీలో పడి చాలామంది నవ్వుకు దూరమవుతున్నారు. ఇలాంటి వారు కడుపుబ్బా నవ్వితే సమస్యలు కూడా తీరిపోతాయని చెబుతున్నారు. నవ్వితే శరీరంలోని 108 కండరాలు ఉత్తేజితమవుతాయి. బీపీ అదుపులో ఉంటుంది. 15 నిమిషాల పాటు నవ్వితే శరీరంలో సుమారు 40 కేలరీలు కరిగిపోతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.


నవ్వుతో ఆరోగ్యం..



నవ్వు వలన ఆరోగ్యం బాగుంటుంది. ప్రతి రోజు తెల్లవారు జామున తెన్నేటి పార్కుకు వచ్చి గుంపులుగా చేరుకుంటాము. మాకు నచ్చిన విధంగా నవ్వుకుంటాం. దీని వలన రోజంతా ఉల్లాసంగా ఉంటాను.

–కేవీ రమణారావు, రిటైర్డ్ నేవీ ఆఫీసర్

ఎన్నో ప్రయోజనాలు



నవ్వడం వలన శరీరంలో గల అన్ని కండరాలు ఉత్తేజితమవుతాయి. దీని వలన రోజు ఉల్లాసంగా గడుస్తుంది. నవ్వు కోవడం పిచ్చితనం కాదు. అది ఆరోగ్యానికి ఎంతో మంచిది.

–ఎం.ఆదినారాయణరావు, రిటైర్డ్ ప్రొఫెసర్, ఆంధ్రయూనివర్సిటీ

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ దిగువ సర్కిల్‌లో ఆటో డ్రైవర్లకు కంచరపాలెం సీఐ మళ్ల అప్పారావు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. డ్రైవర్లు బ్యాడ్జి ధరించాలని, లైసెన్స్ ఉన్నవారు మాత్రమే డ్రైవింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.